
# ప్రత్యామ్నాయం

## కె.వరలక్ష్మి

క్రేన్ కథల పోటీలో
ప్రధమ బహుమతి
పొందిన కథ



**శివరాత్రి వెళ్లిన నాలుగోరోజు,**

**ఫాల్గుణ మాసపు నెలపొడుపు పశ్చిమాకాశంతో పొదగట్టి మాయమైంది. పగలు ముదిరిన ఎండ పల్చబడి సాయం కాలానికి ఏరంగో తెలీని జాజర జాజర మేఘాలలుము కుని నేలైనా తడవని సన్నని చినుకులు పడి ఆగిపోయాయి. చిరు గాలుల్తో వాతావరణం చల్లబడి ఊరిచివరి రావిచెట్టు ఆనం దంగా కొమ్మారెమ్మల్ని వీవనలు చేసి విసరసాగింది.**

చెట్టుపైన గూళ్లు కట్టుకున్న పక్షులు, చెట్టుకింద గూళ్లులేని మనుషులు, గిన్నే చెంబూ, పిల్లాజెల్లా, కోడీకుక్కా అన్నిటితో కూడిన సంసారాలు ఆరుబయట, కొమ్మకొకరు చొప్పున పది సంసారాలు విడిది చేసాయా రోజు చెట్టు కింద.

"మాయయ్య నాకు సిద్దయ్యని పేరెందుకెట్నాడో తెల్సా..." మా యూరసలు కాలవలాకుల కింద గనపోరం. మా తాత ముత్తాతల కాణ్నుంచి మాదదేవూరు. సక్కంగా ఒక గుడిసీ గూడూ ఉండేది. ఒకపాలేవైందంటే నాను కడుపులో ఉన్నప్పుడు పడవట్నించి మాయూరి కొక కాసాయి గుడ్డల సాదువొచ్చినాడంట. ఆ బాబు పొగటేల మూడిళ్లు తిరిగి మూడు గుప్పిల్లు అన్నవెట్టించుకొని తినేసి రామాక్రిష్ణా అనుకుంటా ఇలాటి సెట్టుకింద కటికి నేలమీద నిద్ర సేసీవోడంట. పొద్దుగూకేయేళ లేసి సెరువులో మూడు మునకలేసి తానవాడి వొళ్లంతా ఈబూది గీరలడ్డంగా గీసుకుని తంబుర్ర మీటుకుంటా అడుగులో అడుగేసుకుంటా నడిసీవోడంట. ఎక్కడికీ..? ఊరిమద్దిలో సింతసెట్టు కింద గట్టుమీదకి, ఒక మాటామంతీ ఏవీలేదు, ఉత్తినే తంబుర్ర తీగి టుం...టుం.... అంతే. అప్పుడాణ్ణి సూసినోళ్లు సాచ్చాత్తు సెరువుగట్టుకాడి గుళ్లోంచి శివుడే లేసి నడిసొచ్చేత్తన్నాడనుకునీ వోరంట" సారాపేకెట్టు అందుకుని పల్లతో తుంచి సత్తుగ్లాసులోకి వొంపుతున్నాడు సిద్దయ్య అప్పటికది రెండోది.

"ఏటి శివుడే... పొగలంతా సెట్టుకింద మునగదీసుకుని తొంగున్నావోణ్ణి శివుడని ఎలాగనీసుకునీవోర్రా మీ వూరోళ్లు? ఆళ్లకి బుర్రా గట్టా ఏవీ లేదేటి" అన్నాడు సామి.

"చెస్ నోర్ముయ్యెహె, సిద్దయ్యగారికి ఆ పేరెలాగొచ్చిందో సెప్తుంటే మజ్జిలో అడ్డుపుల్లలాగ, ఆరికి కోపమొత్తే ఇంక సెప్పకుండా ఆపేత్తారంతే." అన్నాడు అప్పిగాడు.

తనని 'గారు' అంటున్నందుకు, తన గురించి అంతబాగా చెప్పినందుకూ మెచ్చుకోలుగా అప్పిగాణ్ణి చూసి తల పంకించేడు సిద్దయ్య, సారాపేకెట్టు అడుగున కొన్ని చుక్కలుంచి దాన్ని అప్పిగాడికిచ్చేసేడు. వాడు అత్తారబతంగా దాన్నందుకున్నాడు. "ఓసోస్, నాకు ఈసామి పేరెందుకొచ్చిందో మూడుముక్కల్లో సెప్పేత్తానినుకో - పదేళ్ల కింద టెప్పుడో ఒకబాబు అయ్యప్ప కొండ కెళ్లొచ్చేసినాక ఆ నల్లబట్టలు నాకిచ్చేసినాడు. అది మొదలు ఏటికేడాది నాను అయ్యప్పకాడికెల్తన్నాననే అడుక్కుంటున్నాను. ఈ నల్లబట్టలేసుకున్న కాణ్ణించి అందరూ నన్ను సామి సామి అనే పిలుత్తున్నారు. ఇంకేంటి, అయిపోయె" అన్నాడు సామి.

"ఏడిసేవులే ఎదవా, నీలాటి ముక్కీసోడికత ఇలాగే ఉంటాది మూడు ముక్కల్లో. సెప్తే మన సిద్దయ్యగారు సెప్పాల, మనం ఇనాల" అన్నాడు అప్పిగాడు. "సెప్పండి గురూగారూ" అన్నాడు సిద్దయ్య కేసి తిరిగి.

సిద్దయ్య చేతిలో ఉన్న సారాపేకెట్టు చూస్తుంటే అప్పిగాడికి భయంతో పాటు భక్తి పొంగిపొరలుతోంది. అవసరంతో బాటు ఆనందం

వెల్లువౌతోంది.

సిద్దయ్య , పక్కనున్న కోతిని దగ్గరకి లాక్కుని దాని వీపు నిమిరేడు. జోలెలోంచి పకోడీల పొట్లం తీసి విప్పి దానికో పకోడీ అందించేడు. అప్పిగాడు ఎలర్టైపోయి "సిద్దయ్యగారో ఈ కోతి..." "తప్పు తప్పు, అనుమంతు", "అదేనండీ. మన అనుమంతు సేలా బాగా ఆటకడతందండి. దీన్నెక్కడ సంపాదించేరండి ?"

"అబ్బో అదా, అది శానా పెద్దకత, ఈ అనుమంతు ఇక్కడోడు కాడు. ఓ పాలి నేను ఇసాపట్నం నించి దొంగల బండెక్కి అలాగలాగ సీకాకోళం దాటి ఎలిపోయేను. ఎల్లగా ఎల్లగా మన బాసకాని ఊళ్లో దిగడిపోయెను, అక్కడ ఆళ్ళూ ఈళ్ళూ అనుకోటాన్ని బట్టి పూరీలో మొండిజగ్గప్ప తీర్ధం మా బాగా జరుగుతాదని అర్ధమైంది. అలాటి కాడే కదా మనకి పదిరూపాయలొచ్చీది! అప్పుడికి నాకాడ ముసిలి కోతొకటి ఉండేది. దాన్నట్టుకోని కుంతదూరం నడిసి, కుంతదూరం బస్సెక్కి ఎలిపోయేను. ఓరి బాబో, అదేం జనవో, అదేం లోకవో, ఇసకేత్తే రాలకుండా ఎక్కడెక్కణ్ణించీ వొచ్చీసేరు. ఏదో పదో పరకో సంపాదించుకుందారని నాను సూత్తుంటే ఆ తొక్కిసలాట్లో నాకోతి జెనం కాళ్లకిందడిపోయి సచ్చిపోయింది. కోతి లేకుండా మనకెవడు దర్మం సేత్తాడు ? సిత్రంగా నొరే, అక్కడ కూడు దొరకటం మాలావు కట్టం, అక్కడ దేవుడికే బండిపూటీల దుడ్డుకూడు ఆరగింపెట్టి బైటికి తెచ్చి అమ్ముతారు. ఇంక అడుక్కునీ వోళ్లకి కూడేవెడతారు. ఇదేట్రా బగ మంతుడా పొట్టట్టుకుని కూటికోసం ఇంత దూరవొత్తే ఇంతపని సేసేసేవు అని నాలోనేనే ఏడ్చుకుంటా మతిలేనోళ్లాగ అలాగలాగ దొరికిందారట్టుకుని ఎలిపోయేను. ఎక్కడన్నా ఏతల్లన్నా జాలిపడి ఒక ముద్ద ఎడితే తింటం మళ్లీ ఎలిపోటం" ఆగి, సత్తుగ్లాసెత్తి గొంతు తడుపుకొన్నాడు సిద్దయ్య.

ఈసారి పరికించి చూస్తే ఇంకొందరొచ్చి సిద్దయ్య ముందు కూర్చుని వింటున్నారు. సిద్దయ్యకి ఎక్కళ్లేని హుషారు వొచ్చేసింది, ఇంకో పకోడి తీసి అనుమంతు నోట్లో పెట్టేడు.

"అలాగ ఎల్లెల్లి, ఆదేశానికి అదే పెద్దూరు, అంటే మనకి అయిద్రాబాదు లాగన్నమాట - అక్కడికెలిపోయేను. ఆవూరి పేరేటోనోట్లో ఆడతంది గాని.... రాటంలేదు... ఆ.. ఏదో ఏస్పర్ అనుంటాది. ఆ వూళ్లో ఈస్పరుడికి ఎన్ని గుళ్లున్నాయో మనం లెక్కెట్టలేం, అన్నుంటాయి. అయ్యిందా, నాకో కోతి నిప్పించు తండ్రీ అని ఆసామికో దణ్ణవెట్టుకుని అలాగ పిచ్చోళ్లాగ ఆ వూరు బైట కొండలకేసి ఎలిపోయేను. సెప్తే నమ్మరు గాని మీకపద్దం నాకు నిజమూని. అక్కడున్నాయొరె కోతులూ.. జగ్గప్ప తీర్తంలో జనవన్నున్నాయి. అక్కడ నేలగానీ కోతుల్ని ఈనేత్తందా అని అనుమానవొచ్చింది నాకు. మొగకోతులు, ఆడకోతులు, సంటిపిల్లల్ని పొట్టకానించుకుని, ఎడపిల్లల్ని ఈపు మీదెక్కించుకుని మనుసులంటే బయ్యం లేకుండా మనుసుల మద్దిన తిరుగుతున్నాయి. అక్కడ కొండలమీద ఎప్పుడో సెక్కిన గుయ్యారాలున్నాయి. ఆటిని సూడ్డానికొచ్చీ జెనం ఉత్తిసేతుల్తో రావూడదు. గిద్దడో, సోలడో ఏపిన ఏరుసెలక్కాయలు కొనుక్కురావాల. అక్కడికి దూరంగా పెద్దపెద్ద బస్తాలేసుకుని అమ్ముతుంటార్లే, అయ్యి. ఆ కోతులేం జేత్తాయీ, ఆటంతటికయ్యే మనిసిమీదకి ఎగబాకి ఆ పొట్లం లాక్కుంతాయి. ఒక కోతొచ్చిందంటే రెండో కోతి రాదు, అంత కట్టుబడి, అక్కడ ఏరు సెలక్కాయల పొట్టులో మనకాళ్లు మోకాలి బంటికి కూరుకుపోతాయి. అక్కడన్ని కోతుల్ని సూసి నా ప్రేణం లేసొచ్చేసిందనుకొండి, ఒకటా రెండా, వోరం రోజులక్కడే ఉండిపోయి ఇదిగో ఈ అనుమంతుని - అప్పుడికిది తల్లికాడ ఎడపిల్ల- మాలింజేసుకున్నాను, ఎవలూ సూడకుండా, దీని తల్లికి కూడా తెలకుండా రాత్రేళప్పుడు దీన్నెత్తుకొచ్చీసేను." అని ముగించి ఒక పకోడి నోట్లో వేసుకున్నాడు.

"కత పక్కకి మల్లిపోయిందండే సిద్దయ్యగారో, మీ పేరు మాట మరిసిపోయి అనుమంతు కతలోకెల్లిపోయేరు" అన్నాడు సామి. అందరూ కలిసి వెలిగించుకున్న ఇలాయిబుడ్డి మంట గాలి ఎటు వీస్తే అటు వొరుగుతోంది. ఆరోజుకి నూకలు సంపాదించుకున్నవాళ్లు మూడు రాళ్లపొయ్యికింద చితుకులమంట జేసి గంజి కాసుకుంటున్నారు. కొన్ని పొయ్యిల మీద సంతలో అడుక్కు తెచ్చుకున్న వంకాయ్ దొంకాయ్, పచ్చిచేప ఎండు పరిగ అన్నీ కలిసిన కలగూరలు ఉడుకుతున్నాయ్.

సిద్దయ్య దగ్గి గొంతు సవరించుకుని మళ్లీ మొదలెట్టేడు, - "దారంటే మాటామంతీ లేని సాధువుకి సింతసెట్టు కింద కొచ్చీతలికి ఏం పూనకవొచ్చీదో తెల్దు, బెమ్మంగారు, ఎవురు ? మన ఈర బ్రెమ్మం గారి సెరిత్ర, కాలగ్నేనం అన్నీ కళ్ళు మూసుకుని పాటలు పాటలు కింద మాటలు మాటలు కింద సెప్పేసీవోడంట" ఆగి మరో రెండు గుటకలేసాడు సిద్దయ్య. "ఆ.. పాటలు పాటలు కింద మాటలు మాటలు కింద బ్రెమ్మం గారి సెరిత్ర సెప్తుంటే ఊరు ఊరంతా సేతిలో ఉన్న పన్లన్నీ ఒగ్గీసుకొచ్చేసి సెట్టుకింద కూకుండిపోయి వోరంట. ఆడోళ్లు మట్టుకి ఆడోళ్లు వొంటాగింటా పొయ్యీ గియ్యీ వొదిలేసి వొచ్చి కూకుండిపోడవే"

ఆడోళ్ల ప్రస్తావన రాగానే అందరూ కిసుక్కుమని నవ్వేరు. మన

## కె. వరలక్ష్మి

ఈమె ఎమ్.ఎ తెలుగు పట్టభద్రులు. ప్రస్తుత నివాసం తూర్పుగోదావరి జిల్లాలోని జగ్గంపేట. ఈమె గతంలో 90కి పైగా కథలు, నాలుగు నవలలు, కవితలు, వ్యాసాలు, నాటికలు రాశారు.



1992, 94 లలో ఎ.జి. ఆఫీసు వారి రంజని అవార్డులు, 93,97లలో రాజలక్ష్మి పురస్కారాలు, 96 న్యూజెర్సీలో అప్పాజోష్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ అవార్డు, 1999-2002సం॥లలో ఎ.టి.ఎ., రంగవల్లి అవార్డులు, తెలుగు యూనివర్శిటి ధర్మనిధి పురస్కారం,2003లో తానా అవార్డు, 2004లో చాసో, పులికంటి సాహితీ సత్కృతి , ఆర్.ఎస్. కృష్ణమూర్తి అవార్డులు పొందారు.



పాముల నారిగాడు బూరా ఊత్తుంటే పావెలాగ తల ఊగించుకుంటా నిలబడి పోతాదో ఆలాగైపోయివోరంట అలాగ నెల్రోజులు కత సాగదీసి సాగదీసి ఇవరంగా సెప్పి ఒకరోజు తెల్లారీతలికి మాయవైపోయేడంట సాదువు" "ఏటీ... మాయవైపోటవే ?' నోరెల్లబెట్టేడు అప్పిగాడు. "అదేలేరా, మాయవైపోటవంటే మరేంనేదు, ఎవ్వరితో సెప్పాపెట్టకుండా ఎక్కడికో ఎలిపోయేడు అంతేనేటి ఆయాల్టినుంచే ఊళ్లో పెద్దమోతుబరి కూతురు అంపడకుండా పోయింది." ఆగేడు సిద్దయ్య.

"ఏటి, లేసెలిపోయేరేటి ఇద్దరూని ?" అన్నాడు సామి.

"ఛీ, కళ్ళుపోతాయెదవా, లెంపలేసుకో ఆ సాములోరు ఎల్లిపోయిన రేత్రి ఆయమ్మకేటైందో, మాయో మంత్రవో కనికట్టో ఎవ్వరికీ తెల్లేదు. నిద్దట్లోంచి లేసి ఆయనగారి అదుగుజాడలమ్మటే నడిసెల్లిపోయిందంట"

" అదే ఇది మరి"

చొక్కా జేబులోంచి నలిగిపోయిన చుట్టముక్క తీసి నోట్లో పెట్టుకున్నాడు సిద్దయ్య అప్పిగాడు ఒక్క అంగలో గెంతి పక్కనే పొయ్యిలోంచి వెలుగుతున్న కట్టె పేడొకటి తెచ్చి భయభక్తుల్తో చుట్ట ముట్టించేడు.

సిద్దయ్య రెండు గుక్కలు పీల్చి పొగవదిలేడు.

" అది సరే గాని, కతంతా అయిపోయింది, సిద్దయ్య కాపేరెవరెట్టారో ఎందుకెట్టారో అర్దవయ్యిందేటి?" అన్నాడు సామి. పొయ్యిమీంచి అన్నం కుండ దించుతున్న సిద్దయ్య పెళ్ళాం ఈరి కిసుక్కుమని నవ్వింది. అందరూ అసంకల్పితంగా అటు తిరిగి చూసేరు.

" ఏటా ఎదవ నవ్వు , నోరు ముయ్యి" అని తన మగతనపు ధాష్టీకం చూపించేడు సిద్దయ్య.

" ఏటహె ఎదవ కంగారు? సిద్దయ్యగారు మొదలెట్టేక సెప్పకుండా వొదిలేత్తారేటి? " అని సామిని కసిరేడు అప్పిగాడు. తన మీద ఉన్న అందరి అటెన్షను ఆమె మీదకు మళ్ళించుకున్నందుకు పెళ్ళాం వైపు కొరకొరా చూస్తూ సిద్దయ్య చెప్పటం మొదలెట్టాడు.

" సెప్పేను కదా, మాయయ్య రోజూ బెమ్మంగారి కత ఇనడానికి ఎళ్లీవోడని, ఆడికి ఆ కతలో అన్నింటికన్నా, అందరికన్నా నచ్చినోడు సిద్దప్పగారంట. అన్నన్నా, సిద్దప్పగారు ఎంత ఇదైనోడు! అనుకొని ముక్కు మీద ఏలేసుకుని ఆచ్చెర్యపోయి, అప్పుడే పుట్టిన నాకు సిద్దయ్య అని పేరెట్టేసేడు" అని ముగించి నులకమంచం మీద వెనక్కి వాలేడు. అప్పటిదాకా అందరితో పాటు కథ వింటున్న కోతి ఆకలేస్తోందని చెప్పడానికి కిచకిచలాడింది.

ఏ ఊరెళ్తే అక్కడల్లా పదేపదే చెప్పే అదే కథని వినివిని విసిగిపోయిన ఈరి " నెగు నెగు మాలావు కత సెప్పేవుగాని, అరిగిపోయిన గేంపోను రికార్డ్లీలాగా, పాడిందే పాడరా పాసిపళ్ళదాసరీ అని అదే కతని ఎంతమందికి ఎన్నిసార్లు సెప్తావు! ఎల్లెల్లు, ఎల్లి ఆ బాయికాడ నాలుగు సేదలు నీళ్ళోంటి మీదేసుకొని రా నీకూ, అనుమంతుగాడికీ వొణ్ణవెట్టేత్తాను" అని కసిరింది.

పక్కనే ఉన్న సన్నికల్లు రాయి మీద ఎవరో ధర్మం చేసిన మావిడి పిందెల్లో కాల్చిన ఎండు మిరపకాయలు, ఉప్పువేసి నూరడం ప్రారంభించింది.

ఈరికి ఓ కాలు అవుడు, పొట్టి, నడిచేటప్పుడు వంగి మోకాలి మీద చెయ్యేసుకుంటేగాని నడవలేదు, అయినా పట్టుతప్పిపోయి ఒకోసారి పడిపోతూంటుంది. అందుకే ఓ కాలుమడిచి, ఓకాలు చాపుకొని మట్టిలో చతికిలబడి నూరుతుంది.

" అంజీ, ఓరంజీ,లెగులెగు, మీయమ్మ ఏదేదీ కూడెడతంది. నీకిట్టవైన మావిడికాయల పచ్చుడ్రా" అని చింకి చాప మీద పడి నిద్రపోతున్న కొడుకుని లేపాడు సిద్దయ్య.

ఆ చెట్టు కింద కాపురం ఉన్న అందరికీ మావిడికాయల పచ్చడిమాట వినపడి నోట్లో నీళ్ళూరుకొచ్చాయి. కారం కారం రుచుల్తో వేడి వేడిగా వండిపెట్టే పెళ్ళాంగలవాడైనందుకు సిద్దయ్యని అందరూ ఈర్ష్యగా చూసేరు.

సిద్దయ్య లేచి తూలుకుంటూ తూలుకుంటూ నూతి దగ్గరకెళ్ళి ఓ చేదెడు నీళ్ళతో కాకి స్నానం సేసి తిరిగొచ్చేడు. అప్పటకీ అంజిగాడు లేవకపోవడం చూసి లాగి పిర్రమీద ఒక్కటంటించేడు. నిద్దట్లో ఉన్న అంజిగాడు తుళ్ళిపడి లేచి తల్లిని వాటేసుకున్నాడు. ఆరునొక్క శృతిలో ఏడుపురాగం అందుకున్నాడు. అంజిగాడి రాగం విని కోతి కిచకిచమని గెంతి తన సానుభూతిని చూపించడం మొదలెట్టింది.

"ఏడ్డం తప్ప ఇంకేటిరాదు ఈనా కొడుక్కి " అని విసుక్కున్నాడు సిద్దయ్య.

ఏటయ్యా, కుర్రోడి మీద పట్టించేవు? వోరం రోజుల్నించి తిండి తిప్పలు లేకుండా ఉత్తి గెంజినీళ్ళతో బతుకుతున్నాడు బిడ్డ ఆణ్ణెందుకు లేపేవు" అని కసురుకుంది ఈరి. భూమి నుంచి రెండడుగులైనా లేని కొడుకు కోతి పక్కన కోతిలా కన్పించడం చూసి దిగులుగా నిట్టూర్చింది.

"ఛెయ్, ఏడుపాపు ఎదవా" అని గద్దించేడు సిద్దయ్య అంజిగాడు అదిరిపడి రాగం ఆపేసేడు. " థూ నీయయ్య, సూసి సూసి కోతినా కొడుకుని కన్నావు కదే. ఈడికి పదారేళ్ళు ముద్దికిందికి వచ్చాయంటే ఎవడైనా నమ్ముతాడా అసలు" అన్నాడు సిద్దయ్య " సాల్లే నీ తాగుబోతు మొకానికి ఇంతకన్నా అందవైన కొడుకు పుట్టేత్తాడేటి? తెల్లారిలేత్తే నీ మొకం, నువ్వాడించీ కోతి మొకవే కదా దర్శనాలు. ఇంకేటవుద్ది మరి!" అని తిప్పికొట్టింది ఈరి. వేడి వేడి అన్నం వండిపెట్టి, కారం కారం పచ్చుళ్ళు నూరిపెట్టి, వొర్రొర్రగా ఎండుచేపల పులుసు లొండిపెట్టి మూడురోజులుగా ఒకటే హైరానా పడుతోంది ఈరి.

శివరాత్రి తీర్దానికి పట్టిసీమ వెళ్లొచ్చేడు సిద్దయ్య. తీర్దంలో కోతిని ఆడించి డబ్బులు బాగానే గడించి ఉంటాడని, వాటినెలాగైనా లాక్కపోతే మొత్తం అంతా తాగుడికే ఖర్చు చేసేస్తాడని ఈరి తాపత్రయం. ఎప్పుడూ అంజిగాణ్ణి తీసుకొని తనూ వెంటవెళ్ళేది. ఈసారి అంజిగాడికి అపరిమితమైన జ్వరం కాయడంతో వెళ్ళలేకపోయింది వచ్చినప్పట్నుంచి ఏ పూట భత్యం ఆ పూట ఇస్తున్నాడు తప్ప డబ్బులు బైటపడనివ్వడం

లేదు సిద్దయ్య. ఆ డబ్బు దన్ను చూసుకుని కోతినాడించడానికి కూడా వెళ్ళడం లేదు. పగలు,రాత్రి తాగి జోగుతున్నాడు.

గిన్నె నిండా అన్నం వడ్డించి. దాని పైన పచ్చడివేసి " మావా. ఉప్పుసేప ముక్కేవైనా కాల్చమంటావేటి?" అనడిగింది. తాగింది బాగా తలకెక్కి ఉన్నాడు సిద్దయ్య. గిన్నె పరిశీలనగా చూసి ఒక్క తాపు తన్నేడు. ఒంగినదాన్ని ఒంగినట్టే జుట్టు పట్టుకొని వీపు మీద గుభీ గుభీమని రెండు గుద్దులు గుద్దేడు.

అమ్మదొంగ సచ్చినోడో, నీజిమ్మడిపోనూ, నీకేం పోయే కాలవొచ్చింది రోయ్" అంటూ సిద్దయ్య చేతిలోంచి జుట్టు విడిపించుకుని, తిట్లని లంకించుకుంది ఈరి.

" లేపోతే, మసాలా దట్టించి కోడికూరొండమంటే రాతి పచ్చడి నూరి పెడతావా రాతి పచ్చడీ" అని మళ్ళుకున్నాడు సిద్దయ్య. " ఆ.. కోడికూర కావాల మొగోడికి ఈడిచ్చిన అయిదు రూపాయలు బియ్యానికే సాల్లేదు, కోడికూర ఎక్కణ్ణుంచొత్తాది? ఎక్కడన్నా కన్నవెయ్యాల. ఈడి మొకం నిప్పుల్లో ఎట్టా, ఎంతెంత దెబ్బలు కొట్టేడో, ఈడి సేతులిరిగిపోనూ" నాలుగడుగులు దూరంగా వెళ్ళి తిట్టడం కొనసాగించింది ఈరి.

" అదేటి గురువా, ఏడేడిగా వొండిపెట్టిన వొదిన్ని అలాక్కొట్టేసేవు? తమ్ముదు తనోడైనా తగువు సరిగ్గా సెప్పమన్నారు. నాకు తెలవకడుగుతాను అయిదు రూపాయలకేటొత్తందీ రోజుల్లో? నీకొక్కడికి సరిపడా కోడి ముక్కలు తేవాలన్నా ఇరవై రూపాయలు కావాల మరింకా అందులోకి నూనీ,మసాళా,ఉల్లిపాయలు గట్టా ఎంతవుతాయో ఆలోసించుకో, ఒక ఏబయ్యయినా ఇచ్చుండవొలిసింది. అబ్బెబ్బే అన్నేయంగా కొట్టేసేవు ఆడకూతుర్ని" అని తగులుకున్నాడు సామి.

"నోర్ముయ్యెహె ఎదవకానా, యాభైలూ, వొందలూ ఎక్కణ్ణుంచి తేను? ఏటి,శివరాత్రి తీర్థానికి కోతినాడిత్తే ఎన్ని డబ్బులొచ్చేత్తన్నాయేటి? ఏనా కొడుకైనా సిటుక్కుమని ఒక రూపాయిబిళ్ళ ఇసురుతున్నాడా? సెల్లని పావలాకాసులు దరమం సేస్తన్నారు దరమ ప్రెబువులు ఒకో మాతల్లి గుప్పిట్లో గుప్పెడు బియ్యం గింజలొట్టుకోని ఇరవైమందికి రెండేసి రెండేసి గింజలిసురుతాది. ఏటి, నేనేదో వొందలు సంపాదించేసి కర్సుపెట్టేసుకున్నట్టు మాటాడేత్తన్నారేటి? వొందలుంటే ఈ గవుర్మెంటు పేకెట్లెందుకు తెచ్చు కుంటాన్రా, బ్రేందీ సీసాయే తెచ్చుకునీ వోడ్డిగానా! ఆ గవుర్మెంటు మారాజులు ఈదీదికీ కొట్లెప్పుదెడతారో, సారా యెప్పుడు సవకవుతాదో! అయినా సంసారవన్నాక మొగోడొక్కడేనా సంపాదించి కూడెట్టాల? ఆడదీ ఒక సెయ్యేయ్యొద్దా? జెమిందారు అమ్మ మొగుళ్లాగ ఈవిడిగారు సెట్టు కింద సాపేసుకొని తొంగుంటాది, నాను సంపాదించి ఈవిడికీ, ఆ పనికిమాలిన్నాకొడుక్కి కూడెట్టాలా?"

"ఓలమ్మోలమ్మో, ఎంతలేసి మాటలంటన్నాడో ఈడి నోరడి పోనూ ఏటి నాను కూకుని తింటన్నానా? పైన ఆకాశం, కింద బూదేవతమ్మ మీద సత్తి ప్రెమాణం సేసి మాటాడు. ఏ ఛెణంలో నీపాలబడ్డానో ఆ ఛెణం నించి ఏనాడైనా కూకుని తిన్నానా? నువ్వోపక్క నడుక్కుంటే నానో పక్కనడుక్కోడం లేదా! ఏదో నాలుగు రోజుల మట్టి కడుపున కనుకున్న ఒక్కగానొక్క నలుసుకి జొరంతో వొళ్ళు పేలాలేగిపోతంటే వొదిలేసి ఎల్లలేక ఉండిపోయేనంతే, ఆదు సంటోడప్పుడు సంకనేసుకునే అడుక్కోలేదా? నానే పదిమందిని కనేసేను, నువ్వే పదిమందిని పోసించేత్తన్నావు?"



"ఓ సోసి ఈవిడి డాట్రుగారు ఈవిడి దగ్గిరుండి సూడాపోతే ఆ కుర్రెదవ సచ్చిపోతాడు. ఎదవ కవుర్లు సెప్పకు మరి, నాకు సిర్రెత్తిపోతాది" సిద్దయ్య జోలెలోంచి ఇంకో సారాయి పేకెట్టు తీసి గ్లాసులోకి వంపేడు.

" సూసేరా సూసేరా, డబ్బుల్లేవు లేవంటానే ఎన్ని పేకెట్లు తెచ్చుకుని ఎదాన్నేసుకుంటన్నాడో కుర్రోడికి ఒక బిళ్లైనా తెచ్చి ఏసేడా? ఓరి దేవుడో, నానేం సేతున్రో.." నెత్తిన చేతులేసుకుని ఏడుపు మొదలెట్టింది ఈరి. ఈ గందరగోళానికి హడిలిపోయి అంజిగాడు మళ్ళీ రాగం అందుకున్నాడు. వాడికి తోడుగా కోతి. ఈరి ఏడుపాపేసి ఒక్క అంగలో వచ్చి కొడుకుని వొళ్ళోకి తీసుకుంది. ఒక చేత్తో కొడుకుతల, మరోచేత్తో కోతి తల నిమురుతూ ఉండిపోయింది.

" సచ్చినోడు, తినాపోతే మానేసి ఏడిసేడు కాదు. బంగారం వంటి అన్నాన్ని మట్టిపాలు జేసేసేడు" అని సణుక్కుంది ఈరి.

సిద్దయ్య తాగి తాగి అలాగే ఒరిగిపోయేడు.

వాడింక నిద్రలేచేది లేదని నిర్ధారించుకుని లేచి కొడుక్కి రెండు గుక్కలు గంజి తాగించింది. "జొరంగాని లేకపోతే ఒండిన అన్నంలో సగం ఈడే తినేసుండడా, దేవుడా నా కొడుక్కి మళ్లీ మామూలు ఆకలేసేలాగ సెయ్యి తండ్రీ, వొచ్చే సమత్సరం శివరేత్రికి తప్పకుండా నీ తీర్తానికొత్తాను" అని మొక్కుకుంది. కుండ అడుగునున్న అన్నం కాస్త కోతికి పెట్టి, మిగిలింది తను తింది. చాప మీద కొడుకు పక్కన నడుం వాల్చింది.

అంజివొళ్ళు చెమటలు పోసింది. కొడుకు నుదుటి మీద చెయ్యి వేసి చూసి " అమ్మయ్య, ఇంక బయంనేదు, జొరం తగ్గిపోతంది" అనుకుంది.

అప్పటికి అందరూ కలోగంజో తాగి నిద్రలోకి జారుకున్నారు.

ఆకాశంలో చుక్కలు మెరుస్తున్నాయి. తమ జీవితాల్లో వెలుగులాగే నెలపొడుపు చందమామ ఇట్టే కనపడి అట్టే మాయమయ్యేడు అనుకుంది ఈరి.

దగ్గర్లోని మేడల్లోని లైట్లింకా వెలుగుతున్నాయి.

" ఆ మేడల్లో వోళ్ళు అర్ధరేత్రి దాకా టీవీలు సూసి అప్పుడు తిళ్ళు తిని తొంగుంటారు.ఆళ్ళకేటి సీకా సింతా, రేపెలాగని బెంగా?" అనుకుంది ఈరి అంతలోనే చెంపలేసుకొని "ఎవరి పున్నెం ఎవరికొత్తాది. ఆళ్ళెప్పుడో పెట్టిపుట్టేరు. నానెప్పుడో ఏదో పాపం సేసేను" అని మనసుని వేదాంతం వైపు మళ్ళించుకుంది.

రాత్రి మెలకువొచ్చినప్పుడల్లా తాగితాగి సిద్దయ్య నిరామయంగా

నిద్రలోకి జారుకున్నాడు. తెల్లారి లేచి సిద్దయ్యని లేపబోయిన అప్పిగాడు ఒక్కసారిగా గొల్లుమన్నాడు "గురువో" అంటూ.

ఈరి కళ్ళల్లో నీళ్లన్నీ ఇంకిపోయేదాకా ఏడ్చి ఏడ్చి ఊరుకుంది. చెట్టు కింది నలుగురూ సాయం పట్టి సిద్దయ్యని గుప్పెడు మట్టి చేసేసారు. చిన్నప్పుడెప్పుడో తల్లి చేయించిన ముక్కుపుడక చీల బిగిసిపోయి ఉండిపోయింది లేకపోతే అది ఎప్పుడో కరిగిపోయేది దాన్ని విరగ్గొట్టి తీయించి, మూడోరోజు సిద్దయ్యని మట్టి చేసిన నలుగురికీ పప్పు అన్నం పెట్టి వాళ్ళ రుణం తీర్చుకుంది ఈరి.

ఈ సందట్లో అనుమంతుని ఎవరో ఎత్తుకుపోయేరు. మర్నాడు మూటాముల్లె సర్దుకొని అక్కణ్నుంచి బయలుదేరేటప్పుడుగాని ఆ సంగతి గమనించలేదు ఈరి. గుండె గుభేలుమంది. సిద్దయ్య లేకపోయినా అనుమంతుని ఆడించి అంజిగాడికింత తిండి సంపాదించి పెట్టొచ్చు అనుకున్న ఈరికి దారితెన్నూ కానరానట్టైంది. నేలమీద చతికిలబడి కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. నెత్తి బాదుకుని ఏడ్చింది, కొడుకు ఆకలి తల్చుకుని మరీ మరీ ఏడ్చింది.

అంజిగాడు ఎప్పట్నుంచో రెప్పవెయ్యకుండా తల్లినే చూస్తున్నాడు. వాడి చిన్ని బుర్రకేం అర్థమైందో దగ్గరకెళ్ళి తల్లి చెంపలమీది కన్నీళ్ళు తుడిచేడు. కిందపడి ఉన్న అనుమంతు మెళ్ళో ఉండే గొలుసు తీసి తన మెళ్ళో వేసుకున్నాడు. అనుమంతు ఫీట్లు చేసే కర్రముక్కని అందుకుని అచ్చంగా దానిలాగే ఫీట్లు చెయ్యడం మొదలుపెట్టేడు. అక్కడున్న చిన్నముంత నెత్తిన పెట్టుకుని అనుమంతులాగే నడుస్తున్నాడు. పిల్లి మొగ్గలేస్తున్నాడు. ఈరి బిత్తరపోయి చూస్తోంది.

అంజిగాడు తన మెళ్ళో వేసుకున్న గొలుసు అవతలి కొస తల్లి చేతికిచ్చి పళ్ళన్నీ ఇకిలించి నవ్వేడు. అది చూసి ఈరి దిగులు మరిచిపోయి ఫక్కుమని నవ్వింది. ★

# ఓ వ్యయా !
# మా పాలిట అక్షయా స్వాగతం

లెఖ్ఖలు తప్పుతున్నా !
తిప్పలు తప్పకున్నా !
స్వార్థం వీడకున్నా !
మోసావేశాలు సహజంగా ఉన్నా !
నీతి నేతి బీరచందమున్నా !
పంజాబీయులు "వైశాఖ"అంటూ !
మహారాష్ట్రీయులు "గుడిపడవా" అంటూ !
అస్సామీయులు "బిహూ" అంటూ !
కేరళీయులు "కొల్లవర్షం" అంటూ !
క్రొత్త చిగుళ్ల వసంతాన్ని భరతజాతి అంతా ! !
విభిన్న రీతుల్లో ఏకత్వంగా ఐక్యమై !
భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటాలని !
హరిమత్స్యరూపుడై సోమకుని సంహరించిన రోజును !
విరించి సృష్టికి ఆద్యత నొసంగిన రోజును !
ధర్మజుడు సింహాసనారూఢుడైన రోజును !
ఉత్తరాయణ పుణ్యకాలమైన రోజును !
ప్రకృతి పురుషుణ్ణి కొలిచే రోజును !
మదనోత్సవాన్ని జరుపుకునే రోజును !
సుమసౌరభాలతో ! ప్రకృతి పచ్చదనంతో !
లేమావిచివుళ్ళతో ! వేపూత సోయగాలతో !
వెన్నెల జల్లులతో ! మల్లెల గుబాళింపులతో !
జాతీయతకు వన్నె తెచ్చే రోజున !
ప్రత్యూష వేళ కుహూ రావాలతో !
కోకిలమ్మ నను నిద్రలేపుతోంది !
చిరుగంటల సవ్వడితో లేదూడ !
చెంగు చెంగున గెంతులేస్తుంటే !
ఇల్లిల్లూ మామిడి తోరణాలతో ముస్తాబౌతుంటే !
షడ్రుచుల సమ్మేళనంనన్నారగించరమ్మని నోరూరిస్తుంటే

ఎక్కడో దూరంగా శాస్త్రమనిపిస్తూ ! వినిపిస్తూ !
అది పంచాంగ శ్రవణమై నా వీనుల విందుగావిస్తుంటే !
ఆనందోత్సాహాల మధ్య జనం !
ఘనంగా తమ ఆమోదాన్ని తెల్పుతుంటే !
ఏమిటో అని పరికిస్తే !?...........
అపుడే కేలండర్‌లోంచి క్రొత్తగా జారిపడింది !
నేనే మీ పాలిటి అక్షయననీ !

-దోసపాటి సత్యనారాయణమూర్తి